# బడి

-కారంపూడి వెంకట రామదాస్

చెట్టుకింద బ్లాక్‌బోర్డూ, నేల మీద పిల్లలతో సాగే, వెనుకబడిన బడైతే అది కాదుగానీ, నాలుగ్గోడలపై పేరుకి పై కప్పుతో ఓ రెండు గదులు మాత్రమే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలది. ఓ గదిలో ఒకే ఒక మాస్టారితో సాగే బోధన. మరో గది మధ్యాహ్న భోజన పాకశాలకి పరిమితం. ఓ మాస్టారూ, ఆయాతో నడుస్తున్న ఆ పాఠశాలలో ఒకటో తరగతి నుండీ ఐదో తరగతి వరకు ఆడా మగా అన్న తారతమ్య బేధం లేకుండా ఒకేచోట చదువుకుంటున్న సామాన్యమైన బడి.

ఇప్పుడిప్పుడే కాన్వెంటు స్కూల్స్ ప్రభావంలో పడిపోతున్న జనం మాత్రం ఆ స్కూల్ని, 'భోజన బడి'గా ఎద్దేవా చేస్తుంటారు. కేవలం ఉచితంగా పెట్టే భోజనం కోసమే పిల్లలు అక్కడ చేరతారని చాలామంది అభిప్రాయం. చాలామందికది సామాన్యమైన పాఠశాలే కావొచ్చు. కానీ రంగారావు మాస్టారుకి ఎంతో అమూల్యమైనదీ, పవిత్రమైనది కూడా.

క్లాస్‌రూమంతా పిల్లలతో కిటకిటలాడటం చూసీ రంగారావుకి నవ్వొచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే ఈ దృశ్యం చూస్తే రోజూ నవ్వొస్తుంది. విద్యని లంచంతో నేర్పించాలనుకునే ఆలోచన ఎవరిదో కానీ ఓ విధంగా ఆ ఆలోచన పనిచేసిందనే చెప్పుకోవాలి. అదే..! బడిలో రోజూ పెట్టే మధ్యాహ్న భోజనం కోసం పిల్లలు హాజరవుతారు. తల్లిదండ్రులు పిల్లల్ని బడికి పంపేదీ అందుకే. భోజనం చేసే వరకు అంతా బుద్ధిమంతులే. ఆ తరువాతే సగం మంది జాడ ఉండదు. మిగతా సగం చదువుకన్నా ఆటపాటలతో కాలక్షేపం చేసేస్తారు. అందుకే రంగారావు ఏం నేర్పాలన్నా భోజనం పెట్టేలోపే నేర్పిస్తాడు.

ఆ రోజు భోజనానికి ముందు పిల్లలకి పాఠాలు నేర్పుతూ రంగారావు ఇలా అన్నాడు.

"పిల్లలూ! మనం చదువుతున్నది ఏ బడిలో అనేదానికంటే ఎంత శ్రద్ధగా చదువుతున్నామన్నదే ముఖ్యం. సామాన్య స్థాయి నుండీ ప్రపంచ కీర్తిని సాధించిన ఎందరో మహాపురుషులు ఈ మాత్రం సౌకర్యం లేని బడిలో చదివారన్న విషయం మనం ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. ఓ అబ్దుల్‌కలాం, ఓ అబ్రహంలింకన్, ఓ ఐన్‌స్టైన్ లాంటి మహాజ్ఞానులు ఈ స్థాయి నుండి పైకొచ్చిన వారే. చదువు మీద దృష్టి నిలిపి పట్టుదలతో చదివితే మీరూ ఉన్నత శిఖరాలని అందుకోవచ్చు. మీరు రోజూ ఈ భోజనం కోసం ఎంత ఆసక్తిని కనబరుస్తారో రెండక్షరాలు నేర్చుకోవడంలో కూడా అదే శ్రద్ధని చూపాలి" అంటూ పిల్లల్లో పఠనాశక్తిని కలిగించి ఈ లెక్కలు నేర్పడం మొదలుపెట్టారు. మధ్య మధ్యలో చిన్న చిన్న పిట్టకథలతో ఆసక్తి రేకెత్తించే ఉదహరణలతో పాఠం చెబుతున్నాడు రంగారావు.

బెత్తంతోకాకా బడి పిల్లల ఇష్టాన్ని ఎరిగి బోధించడం రంగారావు ప్రత్యేకత.

★★★

"ఏవండీ..! ఏం ఆలోచించారు..." అంది రంగారావు భార్య జానకి.

"ఏ విషయం.." భార్య ఏ విషయం మాట్లాడుతున్నదో తెలిసీ కూడా తెలీనట్టు అన్నాడు రంగారావు.

"అదే..! మన అబ్బాయిని ఏ స్కూల్లో వేద్దామనుకుంటున్నారు?"

"ఆ..ఆ..అదీ.."

"ఏంటండీ మీలో మీరే ఆ గొణుగుడు. ఏ విషయం చెప్పండి?"

"చెప్పడానికేముందీ. మన బడిలో వేద్దాం" ఈ జవాబిస్తూ భార్య రియాక్షన్ కోసం ఆమెకేసి చూశాడు.

ఇది విన్న జానకి భర్త వైపు చివుక్కున చూసింది.

"ఏదీ.. పనికి ఆహారం పథకంలా చదువుకి తిండి పెట్టే మీ 'భోజన బడి'లోనా...?" ఠక్కున అంది జానకి.

చదువుకి తిండి పెట్టే స్కూలని ఎద్దేవగా అన్న భార్య సమాధానానికి హతాశుడయ్యాడు రంగారావు. గాయపడింది అతడి మనసే కాదు, ఆత్మగౌరవం కూడా!

"ఆ చదువుకి తిండి పెట్టే స్కూలే" మనకీ తిండి పెడుతున్నదని మరచావా..?"

"అలాగని... చూస్తూ చూస్తూ మన బిడ్డని మీ బడిలో వెయ్యడానికి మీ మనసెలా ఒప్పింది. చిరిగిన బట్టలతో మురికి కంపుకొట్టే ఆ పిల్లల మధ్య నా బిడ్డని నేనూహించుకోలేను. అయినా ఈ ఊర్లో కూడా కాన్వెంట్ స్కూలు తెరిచారు కదా.. ఇంకా మీ బడంటారేంటీ?" భర్త నిర్ణయాన్ని ససేమిరా అంటూ తన అభిప్రాయాన్ని కుండబద్దలుకొట్టినట్టు చెప్పింది జానకి.

ఈ మాటలతో ఆవేశానికి లోనైనాడు రంగారావు.

"పిల్లల్లో పసుండాలికానీ కాన్వెంటైతేనే.. ప్రభుత్వ పాఠశాలైతేనేం...? మహానుభావుడు అబ్రహంలింకన్ వీధి దీపాల కింద చదివి దేశాధ్యక్షుడయ్యాడు. ఇక మన అబ్దుల్‌కలాం సామాన్య బడిలో చదివిన వారే.. ఊరి బడుల్లో చదివే ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించిన సంగతి నీకు తెలిసిందేగా...

"చాల్లెండి...మీ మాటలు.. ఆ రోజుల్లో ఆ బడులే గతి. అందుకే వాళ్లంతా అక్కడ చదివారు."

"ఊ.. అంటే నీ ఉద్దేశంలో ఈ రోజుల్లో మాలాంటి బడిలో చదివే వారెవ్వరూ పైకి రావడం లేదానా...?" సూటిగా ప్రశ్నించాడు రంగారావు.

"ఒక్క ప్రశ్నకి సమాధానం చెప్పండి...? మీరు చెప్పిన ఆ మహానుభావుల పిల్లలెవరైనా ఇప్పుడు మీలాంటి బడిలో చదువుతున్నారా? అంతెందుకు మీ తోటి మాస్టర్లు కానీ మీ పై అధికారుల బిడ్డలు గానీ.. మీ పాఠశాలల్లో చదువుతున్నారా?" సూటిగా ప్రశ్నించింది.

సగటు స్త్రీ తన భార్య జానకి! ఆమె ఆలోచనంతా తన బిడ్డ భవిష్యత్తే..! ఇలా తమలాంటి

మాస్టర్లూ ఆలోచిస్తే రేపు ఈ సాంప్రదాయ పాఠశాలలు చరిత్రపుటల్లో మిగిలిపోక తప్పవు.

వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు రంగారావు.

"నా ప్రశ్నకి సమాధానం లేకపోతే మీ అభిప్రాయం మార్చుకోవాలి" నిశ్చయంగా అంది జానకి.

★★★

ఆరోజు రంగారావు పిల్లలకి గణితం చెప్పున్నాడు.

"ఐదొకట్లా ఐదూ... ఐదు రెళ్లు పది..." ఎక్కాలు కంఠతా పెట్టిస్తున్నాడు.

"ఐదుమూళ్లూ పదిహేనూ.. ఐదు నాల్గులు ఇరవై.." అంటూ టకటక మిగతా ఎక్కం చెప్పుకుంటూ పోతున్న ఓ విద్యార్థిని వైపు వింతగా.. ఆనందంగా చూశాడు రంగారావు.

"పాపా..నీ పేరు అంజని కదూ...!" కొత్తగా ఈమధ్యే బడిలో చేరిన ఆ పాప వైపు చూస్తూ అన్నాడు రంగారావు.

"అవును మాస్టారూ.." అంది అంజలి.

"మీ నాన్నగారి పేరేంటి?"

"వెంకటరావుగారు"


"ఎక్కడుంటున్నావమ్మా?"


"అగ్రహారం వీధిలో"

కుతూహలం కొద్దీ అడిగిన రంగారావు ప్రశ్నలకి వెనువెంటనే సమాధానమిచ్చింది అంజలి.

ముద్దులొలుకుతూ అందంగా ఉన్న అంజలిని చూస్తే ముచ్చటేసింది రంగారావుకి.

ఆమె తెలివైన పిల్లని తెలుసుకోవడానికి అట్టే సమయం పట్టలేదు. అయితే అతడి మదిలో ఒక సందేహం కలిగింది. ఈ పిల్లని కూడా ఉచితభోజనాన్ని ఆశించే ఆమె తల్లిదండ్రులు ఇక్కడికి





పంపారా..?

అంజలి లాంటి విద్యార్థులు ఒకరిద్దరున్నా చాలు ఏ మాస్టారైనా ఉత్సాహంతో పాఠాలు చెప్పడానికి. రంగారావు కూడా ఆ రోజు అదే చేశాడు.

సమయం పన్నెండు కావడంతో స్కూల్ గంట గణగణ మ్రోగింది. పిల్లలు ఒక్కసారిగా ఆనందంతో కేకలేశారు. కారణం భోజన సమయం ఆసన్నమైందని.

"నిశ్శబ్దం.. నిశ్శబ్దం.." అంటూ పిల్లల్ని అదిలిస్తూ ఒక్కొక్కర్నే లైన్లో పంపి స్కూల్ ఆవరణలో కూర్చోబెట్టారు. అందరికీ వడ్డనలు ఆయా చేసింది. దగ్గరుండీ అంతా గమనిస్తున్నాడు రంగారావు. అంజలి కూడా భోజనం కోసం పంక్తిలో కూర్చునుంది. ఆమెకీ వడ్డన జరిగింది. నెమ్మదిగా తింటున్న అంజలి వైపు చూసీ నవ్వుకున్నాడు రంగారావు. ఆకలితో ఉన్న పిల్లలు వెంటనే తినేసీ ఇంకా పెడతారేమోనని ఆశగా ఆయా వైపు చూస్తుండటం గమనించిన అంజలి తన విస్తట్లో ఉన్న భోజనాన్ని పక్క విద్యార్థికి అందించింది. ఇదంతా చూస్తున్న రంగారావు అవాక్కయ్యాడు. ఏంటీ పిల్ల..? ఈ వయసులో ఇంత సహృదయం..?

"అంజలీ! నీకాకలిగా లేదూ?" అన్నాడు రంగారావు.

"ఈ పిల్ల ఉదయం నుండీ ఏమీ తినలేదట.. ఆమె వంతు ఏమీ సరిపోలేదులా ఉంది. నేనింట్లో తినే వచ్చానులెండి. అందుకే పెట్టాను" నవ్వుతూ చెప్పింది.

"హేట్సాఫ్...!". అని మనసులోనే అనుకున్నాడు రంగారావు.

★★★

"జానకీ! పాఠశాల తనిఖీ నిమిత్తం రేపు మధ్యాహ్నాం ఓ ఇన్‌స్పెక్టర్ మన స్కూల్‌కొస్తున్నారని వార్త అందింది. మన స్కూల్ భోజనం పెడితే బాగుండదు. నువ్వే ఆ ఏర్పాట్లేవో కాస్త చూడుదూ.." బ్రతిమలాడుతూ అన్నాడు రంగారావు.

"అలాగే.." ఏ కళనుందో.. కలహానికి దిగకుండానే సుముఖతని వ్యక్తం చేసింది జానకి.

"హమ్మయ్యా..!" అని మనసులోనే ఊపిరి తీసుకున్నాడు రంగారావు.

వచ్చే ఇన్‌స్పెక్టర్ పేరు కె.వి.రావు! ఆయనకి ఉపాధ్యాయ వర్గంలో ఎంతో పేరుంది. రావుగారిగా సుప్రసిద్ధులు. చాలా సిన్సియర్..! స్ట్రెట్ ఫార్వార్డ్! అతడి ద్వారా ఎన్నో పాఠశాలలు బాగుపడ్డాయి. ఆదర్శవాదే కాదు ఆచరణశీలి కూడా. అందరు ఉపాధ్యాయులూ తమ సర్వీస్ పిరియడ్లో ఒక్కసారైనా అతడితో ముఖాముఖిని కోరుకుంటారు. తనకా అదృష్టం ఇలా వచ్చినందుకు రంగారావు ఆనందంతో లోలోనే ఉక్కిరిబిక్కిరయ్యాడు.

★★★

ఆకాశం మేఘావృతమై ఉంది. వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంది. ఆ రోజు బడి పిల్లలతో కిటకిటలాడుతోంది.

రంగారావు చెప్పే పాఠాలని పిల్లలు శ్రద్ధగా వింటున్నారు.

పదకొండు గంటల ప్రాంతంలో రావుగారు జీపులో అక్కడికి వచ్చారు. పిల్లలు పలికిన స్వాగత వచనాల్ని చిరునవ్వుతో స్వీకరిస్తూ బడిలోకి అడుగుపెట్టారు. సువాసనలు వెదజల్లుతున్న పుష్పగుచ్ఛాన్ని హృదయపూర్వకంగా స్వీకరించారు.

అంజలీ ప్రార్థనా గీతం ఆలపించడమే కాకా అన్నిటా చురుకుగా వ్యవహరించింది.

బడి ఆవరణంలో ఇటుఅటు తిరుగుతూ అక్కడి పరిస్థితిని అంచనా వేశారు రావుగారు. మధ్యాహ్న భోజన నాణ్యతని కూడా చెక్ చేసే తృప్తి చెందారు. చివరికి క్లాసురూమ్ కొచ్చీ అతని కోసం కేటాయించిన కుర్చీలో ఆసీనురాలైయ్యారు. పక్కన రంగారావు వేరే కుర్చీలో కూర్చున్నాడు.

రావుగారు పిల్లల్ని ఉద్దేశించీ ప్రసంగించిన మీదట వారిని కొన్ని ప్రశ్నలేశారు. అధిక శాతం పిల్లలు సమాధానాలు సరిగ్గానే చెప్పడంతో రంగారావు సమర్థుడైన ఉపాధ్యాయుడేనని ఇట్టే కనిపెట్టేశారు. ఇటువంటి ఉపాధ్యాయుల్ని ప్రోత్సహించాలంటే ముందు మౌలిక సదుపాయాలు కల్పించాలి అనుకున్నారు మనసులో.

చాలా చోట్ల తనొస్తున్నానంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ ఇక్కడ అలాంటివేవీ కనబడలేదు. చాలా సహజంగా ఉంది. అదే రంగారావు సిన్సియారిటీని చెప్పకనే చెబుతోంది. ఈ విషయమే రావుగారిని ఎక్కువగా కన్వీన్స్ చేసింది.


ఒంటి గంట ప్రాంతంలో జానకి కేరేజి తీసుకొచ్చింది.

రంగారావు పదే పదే బలవంతం చేయడంతో మొహమాటం పడుతూనే భోజనానికి ఒప్పుకున్నారు రావుగారు. చక్కటి వెడల్పాటి అరిటాకులు ఇద్దరికీ



## బిజీ...బిజీ...!

మలయాళ సినీ రంగం నుంచి అనుకోని విధంగా వచ్చిన ఆహ్వానం పార్వతీ మెల్టన్ కెరీర్‌ని మలుపు తిప్పింది. మోహన్‌లాల్ హీరోగా 'హలో' అనే సినిమాలో పార్వతి హీరోయిన్‌గా నటించిన సినిమా సూపర్ హిట్ కావడంతో అక్కడి నిర్మాతల దృష్టి పార్వతిపై పడడంతో సినిమా చాన్సులు కోకొల్లలుగా వస్తున్నాయి. విదేశాల్లో పుట్టి పెరిగిన ఈ అందాల భామ ప్రస్తుతం మలయాళ సినిమాలతో బిజీ బిజీగా వుంది.



వేసి స్వయంగా జానకే భోజనం వడ్డించింది. ఐటమ్స్ అద్భుతంగా ఉండటంతో మనసారా తృప్తిగా భోంచేశారు ఇద్దరూ. జానకి వంటకాలు మెచ్చుకోకుండా ఉండలేకపోయారు రావుగారు.

ఇంతలో చినుకులు మొదలైనాయి.

"రంగారావుగారూ...! మీ బడికి మరో గది నిర్మాణానికి, ఇంకో ఉపాధ్యాయుడి నియామకానికి కూడా ప్రభుత్వానికి సిఫార్సు చేయడానికి నిర్ణయించాను. త్వరలో అన్ని చర్యలు చేపడతాను" అన్నారు రావుగారు బయలుదేరుతూ.

ఈ ప్రకటనకి రంగారావు ఆనందంతో ఉప్పొంగిపోయాడు.

"వానొచ్చేటట్టుంది ఈ రోజుకి పిల్లలకి ఇక సెలవిచ్చేయండి!" అని రంగారావుతో అన్నారు రావుగారు.

రంగారావు వెంటనే పిల్లలకి సెలవు ప్రకటించాడు. దాంతో పిల్లలు కేరింతలు కొడుతూ బయటకి పరిగెట్టారు.

చినుకుల్లో తడుస్తూనే రావుగారు జీపుకేసి వడివడిగా అడుగులేశారు. రంగారావుతో పాటూ జానకీ, వెనకనే కొందరు బడిపిల్లలూ ఆయన్ని సాగనంపడానికి అతనితో పాటూ నడిచారు.

"నాన్నగారూ...! పెద్దవానొచ్చేటట్టుగా ఉంది... నన్నూ మీ జీపులో ఇంటివరకూ దిగపెట్టరూ..." అన్న అంజలి మాటలు రంగారావుతో పాటూ జానకిని కూడా విస్మయానికి గురిచేశాయి.

రావుగారు చిరునవ్వుతో కూతుర్ని ఆహ్వానిస్తూ చేతులు చాచారు.

ఈ సంఘటనలో నోట మాట రాలేదు. రంగారావు, జానకిలకి.

"సార్.. అంజలి మీ అమ్మాయా? కష్టం మీద గొంతు పెగుల్చుకుని అడిగాడు రంగారావు.

"అవును. ఈ ఊర్లోనే ఉంటున్న నా తమ్ముడింట అంజలి ఉండి చదువుకొంటోంది." అంటూ నిజాన్ని చెప్పారు రావుగారు.

"మీ అమ్మాయిని ఈ..." తన బడిని తానే తక్కువ చేసుకుని మాట్లాడ్డం ఇష్టం లేకా మధ్యలోనే ఆగిపోయాడు రంగారావు.

అయితే ఆ పని జానకి చేసింది.

"మీ అమ్మాయిని ఈ 'భోజన బడి'లో ఎలా వేయగలిగారు..?" తనని తాను తమాయించుకోలేక అడిగేసింది జానకి. ఆ తరువాత తప్పు చేసిన భావంతో తలవంచింది.

"చూడమ్మా...! నువ్విలా అడగటంలో తప్పులేదు. ప్రభుత్వ పాఠశాలలంటే జనానికి చులకనభావం పెరిగిపోవడం నిజంగా చాలా దురదృష్టకరం. చదువుకి ముఖ్యం పిల్లల్లో స్వతహాగా తెలివితేటలూ.. ఆపై రంగారావులాంటి మాస్టర్లూ! ఏవరేజ్ స్టూడెంట్స్ కూడా నీ భర్తలాంటి ఉపాధ్యాయుల చేతిలో పడితే మెరుగుదిద్దబడి ఉత్తమ విద్యార్థులుగా మారతారు.మంచి నడవడీ, స్నేహపూరిత వాతావరణం, దేశభక్తి కల్పింపబడితే విద్యార్థులలో ఉత్తమ గుణాలు అంకురించి మేలైన విద్యార్థులుగా సమాజానికి అందింపబడతారు. ఇకపోతే, నువ్వన్న ఈ 'భోజన బడి' కీ...కాన్వెంట్ స్కూల్స్‌కి ఉన్న తేడా అల్లా ఒక్కటే. క్రమశిక్షణా.. చక్కని వాతావరణం.. ఉపాధ్యాయుల బోధనలో అంకితభావమే..! వాటిపైనే నా దృష్టంతా... రాబోయే రోజుల్లో దీన్ని సాధించడమే నా జీవిత లక్ష్యం...! నీ భర్తలాంటి మాస్టార్ల సహకారంతో దాన్ని తప్పక సాధిస్తానన్న ఆత్మ విశ్వాసం నాకుంది."

రావుగారి సమాధానానికి రంగారావుతోపాటూ జానకి కూడా హర్షించకుండా ఉండలేకపోయింది.

***

ఆ రోజు రాత్రి.

రంగారావు, జానకిలు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

రంగారావైతే రావుగారి పరిచయ ప్రభావం నుండి ఇంకా తేరుకోలేకపోయాడు.

"ఏమండీ...! మనబ్బాయి సంగతేం చేశారు..?" మళ్లీ అడిగింది జానకి.

"ఊ.. నువ్వు చెప్పినట్టుగానే చేద్దాం."

"వద్దండీ.. మనబ్బాయిని మీ బడిలోనే వేద్దామండీ" మనస్ఫూర్తిగా అంది జానకి.

ఆ రోజు తన భార్య వేసిన ప్రశ్నకి ఈ రోజు రావుగారి రూపంలో సమాధానం దొరికినందుకు మనసులోనే అతనికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. జానకి ఆలోచనా సరళిలో మార్పు వచ్చినందుకు మనసులో సంతోషపడుతూనే.

"ఏదీ... 'భోజన బడి'లోనా...?" అంటూ భార్యని ఉడికించాడు.

"పోదురూ.." ఆ నాటి తన మాటలకి సిగ్గుపడుతూ అంది జానకి.

★

## గొర్రె హడావుడి!

పారిపోతున్న గొర్రెను పట్టాలంటే ఎంతమంది కావాలి? బ్రిటన్‌లో ఒక గొర్రెని పట్టుకోవడానికి ఆరుగురు పోలీసులు, నలుగురు మార్కెట్ పనివాళ్ళు,



ఇద్దరు ఫ్యాక్టరీ వర్కర్లు, ఒక సెక్యూరిటీ గార్డు... మొత్తం 13మంది కలసి రెండు గంటలసేపు దాని వెంట పడ్డారట. కార్ల మధ్యనుంచి దూరిపోతూ ఆ గొర్రె ట్రాఫిక్ జామ్‌ను సృష్టించింది. చివరికి కార్లో కూర్చున్న ఓ వనిత తన రగ్గుని దానిమీదకు విసిరి అదిమిపెట్టి ఆ గొర్రెని పట్టించిందిట.

-విమల

